హైదరాబాద్ వార్త

# సాగర తీరంలో సంస్కృతీ వైభవం






హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త : భారతీయ సాంస్కృతిక మహోత్సవం హోరెత్తింది. వివిధ రాష్ట్రాల కళాకారులు తమ సంస్కృతి, సంప్రదాయాలను చాటే ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

పీపుల్స్ ప్లాజా వేదికగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సంస్కృతి మహోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. ఈ ముగింపు వేడుకల్లో గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరై సంప్రదాయ నృత్య ప్రదర్శనలను తిలకించారు. సాగర తీరంలో సాయంత్రం వేళ నిర్వహించిన ఈ సంప్రదాయ నృత్యాలు వీక్షకులను అబ్బురపరిచాయి. పలు రాష్ట్రాలకు చెందిన వంటకాలతో కూడిన స్టాళ్లలోని రుచులను సందర్శకులు ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో కంఏంద్ర సాంస్కృతిక శాఖ జోనల్ సంయుక్త కార్యదర్శి అమితా ప్రసాద్ సారాభాయ్, సౌత్ ఎంట్రల్ జోన్ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ కేకే గోపాలకృష్ణ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి పాల్గొన్నారు.

## 21న బండ్లగూడ కార్పొరేషన్‌లో మళ్లీ అవిశ్వాస పరీక్ష

### ఫారం-2 నోటీసులను తీసుకోని ముగ్గురు సభ్యులు

నార్సింగి, మార్చి 5 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో ఈ నెల 21.వ,తేదీన రెండోమారు మేయర్‌పై అవిశ్వాస పరీక్షను పెట్టడం జరుగుతుందని కమీషనర్ శరత్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు 21.వ,తేదీన బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 11.గంటల సమయానికి అవిశ్వాస పరీక్షను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ అవిశ్వాసానికి సంబంధించిన నోటీసులు కార్పొరేషన్ పరిధిలోని 18.మంది కార్పొరేటర్లకు అందజేశామని తెలిపారు. మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రీలత సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్‌లు తాము నోటీసులు ఇచ్చేందుకు వారి ఇళ్ల వద్దకు వెళ్లిన సమయంలో అందుబాటులో లేరని, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించగా వారు తీసుకోలేదని కమీషనర్ వివరించారు. మొదటి సారి ఫిబ్రవరి 16.వ,తేదీన అవిశ్వాస పరీక్ష జరుపాల్సి ఉండగా మేయర్ మహేందర్‌గౌడ్ హైకోర్టు నుంచి స్టే తీసుకు రావడంతో వాయిదా పడింది. అప్పుడు క్యాంపుకు వెళ్లిన 16.మంది కార్పొరేటర్లు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కార్యాలయంకు రావడంతో అధికారులు అవిశ్వాసంపై హైకోర్టు స్టే ఇచ్చిందని, మళ్లీ కోర్టు నుంచి కానీ, ఉన్నతాధికారుల నుంచి కానీ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అవిశ్వాస పరీక్షను నిలిపివేస్తున్నామని ప్రకటించారు.

## నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థులు రాస్తారోకో



సైఫాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఆరోపిస్తూ బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థులు మంగళవారం హాస్టల్ ఎదుట రోడ్డుపైన బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకో ఆనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా విద్యార్థులకు పోలీసులు ఎంతో నచ్చుజెప్పారు. అయినప్పటికి విద్యార్థులు వినకపోవడంతో పోలీసులు ఆనేక మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా నిజాం హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన అన్నం, కూరలు పెడుతున్నారని దీంతో విద్యార్థులు ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ముఖ్యంగా కడుపులో నోప్పిటకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. దీంతో తాము ఆందోళనకు దిగవలిసి వచ్చిందన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కమిషనర్

నార్సింగి, మార్చి 5 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను మంగళవారం కమీషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాలను పరిశీలన చేసినట్లు కమీషనర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కావాల్సిన ఏర్పాట్లు అన్నీ ఉన్నాయా? లేవా? అని చూడడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు తాగేందుకు మంచినీరు అందుబాటులో ఉంచడం జరిగిందని, అలాగే ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఉండేందుకు గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించడం జరిగిందని వివరించారు.

# సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి

### జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్




కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, మార్చి 5 ప్రభాతవార్త: ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ ఆదేశించారు. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వివిధ సమస్యల్ని పరిష్కరించుకోవాలని కోరారు. ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి గ్రేటర్ అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని సర్కిళ్ళలో కనీస సదుపాయాల కల్పనకు ప్రణాళికల్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. పారిశుద్యం మెరుగుకు చర్యలు తీసుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ అధికారులు చూడాలన్నారు. ప్రజలు కూడా చెత్తా, చెదారాలను రోడ్లపై వేయకుండా సహకరించాలని కోరారు. జోన్‌లోని 23,24,25,26,27 మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ సర్కిళ్ళలో సమస్యలు ఉంటే డిప్యూటీ కమిషనర్లతోపాటు ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఆస్తిపన్ను విభాగం అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో 22 మూసాపేట 5 కూకట్‌పల్లి 9 కుత్బుల్లాపూర్ 9, అల్వాల్2 గాజుల రామారం 11, అల్వాల్ 2 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ తెలిపారు.

## షాహినాయత్‌గంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.బాలు చౌహాన్



బేగంబజార్,మార్చి 5ప్రభాత వార్త: శాంతి భద్రతలను కాపాండేందుకుగాను ప్రజలు పోలీసులకు సహకరించాలని షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ పదవి భాద్యతలు చేపట్టిన ఎల్.బాలు చౌహాన్ కోరారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన రవీందర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో షాహినాయత్ గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.బాలు చౌహాన్ మాట్లాడుతూ శాంతి భద్రతలను పట్టిషంగా అమలు చేస్తామన్నారు. విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## అయ్యప్ప సొసైటీలోనూ తెగబడ్డారు

రహదారులను మింగుతున్న రాబందులు- 2

# వంద అడుగుల రహదారిని బొంద పెట్టారు



మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో ఎలాంటి అనుమతి లేకుండా వంద అడుగుల రహదారిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

అది సాఫ్ట్‌వేర్ రంగంలో అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన హైటెక్‌సిటీ ప్రాంతం.. ఇక్కడ వేలాదిగావున్న సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పనిచేసేందుకు నిత్యం లక్షలాదిమంది ఐటి నిపుణులతోపాటు అనుబంధ వ్యాపార సంస్థల్లో పనిచేసేందుకు అంతకు నాలుగురెట్లు మించి జనం రాకపోకలు సాగిస్తారు. ఇక హెచ్‌ఐసిసి, హైటెక్స్ వంటి ప్రపంచస్థాయి వేదికలకు నెలవు కావడంతో విఐపిల తాకిడి కూడా అధికంగానే ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో పనిచేసే మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉండాలి..? కానీ 'బాధ్యత, జవాబుదారీతనం' అన్నది వీరిలో మచ్చుకైనా కనిపించదు. అనుమతి లేని ప్రతి భవనంలోనూ అక్రమార్జన మాత్రమే తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు వీరికి ఏమాత్రం పట్టవు. లోలోపల కొనసాగే అనుమతిలేని అంతస్తులపై విరుచుకుపడే వీరు ప్రధాన రహదారులను మాత్రం కబ్జాదారులకు రాసిస్తున్నారు. దీంతో విఐపి జోన్‌గా పిలువబడుతున్న హైటెక్‌సిటీ ప్రాంతం ప్రతినిత్యం ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కి విలవిలలాడుతోంది.

సైబరాబాద్ ప్రతినిధి - ప్రభాతవార్త

ఒక సామాన్యుడు తన సొంత స్థలంలో నాలుగడుగులకు మించి ప్రహరీగోడ నిర్మిస్తేనే బ్రహ్మాండం బద్దలైనట్లు ఆగమేఘాలమీద వెళ్లి భయభ్రాంతులకు గురిచేసే పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బందికి అయ్యప్ప సొసైటీలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఆకాశ హర్మ్యాలు కనిపించడంలేదు. అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న కిందిస్థాయి సిబ్బంది ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా కోర్టు నిబంధనలు విధించిన స్థలాల్లో సైతం ఆకాశ హర్మ్యాలను ప్రోత్సహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. వీరి అండదండలతో ఇప్పటివరకు లోలోపల అనుమతిలేని నిర్మాణాలు కొనసాగిస్తున్న వారు ఇప్పుడు ఏకంగా వంద అడుగుల రహదారినీ వదలకుండా అక్రమ నిర్మాణాలకు తెగబడుతున్నారు. దీంతో అయ్యప్ప సొసైటీలోని ఈ రహదారి పూర్తిగా ఇరుకుగా మారి వాహనదారులకు ప్రతినిత్యం నరకాన్ని చవిచూపిస్తోంది.

- అధికారులే అండగా అనుమతిలేని నిర్మాణాలు
- రహదారుల కబ్జాతో విఐపి జోన్ విలవిల
- అధికారుల్లో కానరాని బాధ్యత
- సిబ్బందిలో మృగ్యమైన జవాబుదారీతనం
- పరాకాష్టకు ప్రణాళికా విభాగం అవినీతి
- హైటెక్ రోడ్లకు ఇక ఆ దేవుడే గతి

**వీరి అక్రమాలకు అడ్డేలేదు..** అక్రమ నిర్మాణాలు సాకుగా చూపి జేబులు నింపుకునే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బందికి ప్రజల కష్టాలు మాత్రం ఇసుమంతైనా పట్టడంలేదు. శేరిలింగంపల్లిలో దశాబ్దాలుగా పాతుకుపోయిన కిందిస్థాయి సిబ్బంది అవినీతితో సమస్య మరింత జఠిలమైందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ ఇటీవల జిహెచ్‌ఎంసి కన్సిల్‌లో ధ్వజమెత్తారు. అవినీతి సంపాదనతో ఔట్‌సోర్సింగ్ సిబ్బందే కోట్లకు పడగలెత్తారని ఆయన కౌన్సిల్ సాక్షిగా వెల్లడించారు. అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బల్దియా ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. అయినా కిందిస్థాయి సిబ్బంది అందించే నజరానాలకు అలవాటుపడ్డ ఉన్నతాధి కారులు వారిపై ఈగకూడా వాలనివ్వడంలేదు. దీంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని విఐపిజోన్‌లో రహదారులన్నీ ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్తుండగా ప్రజలకు మాత్రం ట్రాఫిక్ కష్టాలు మిగులుతున్నాయి.




చార్మినార్ ఎసిపిగా బాధ్యతలు స్వీకరించిన పి.చంద్రశేఖర్‌ను చార్మినార్ సిఐ చంద్రశేఖర్,పోలీస్ సిబ్బంది కలిసి అభినందిస్తున్న దృశ్యం



ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్.ఇంద్రీస్ కుమార్‌ను కలిసిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి డా.మధవి లత

# చాక్ పౌడర్, గంజితో ట్యాబ్లెట్లు తయారీ

### నగరంలో ఊహించని మాఫియా




హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: నగరంలో నకిలీ మందులు తయారు చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. చాక్ పౌడర్, గంజితో మెడిసిన్స్ తయారు చేస్తున్నారనే పక్కా సమా చారంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెగ్‌లైఫ్ సైన్సెస్ కంపెకనీ పేరుతో మందుల విక్ర యాలు జరుపుతున్నట్లు గుర్తించారు. మొత్తంగా రూ.33 లక్షల విలువైన మందులను సీజ్ చేశారు. ఆ తర్వాత ఈ నకిలీ మెడిసిన్స్ తయారు చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేపట్టారు. ఫేక్ ప్రకటనలు చూసి మోసపో వద్దని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సూచించారు. టీవీల్లో, సెల్‌ఫోన్లలో ప్రకనటలు చూసి ఈ మధ్య టాబ్లెట్స్ కొను గోలు చేయడం అందరికి అలవాటుగా అయిపోయిందని గుర్తు చేశా రు. వీటిలో చాలా పెద్ద మోసం దాగుందని అనుమానాలు వ్యక్తం చేశారు. నగరంలో గుర్తింపు పొందిన మెడికల్ షాపుల్లోనే మందు లను కొనుగోలు చేయాలని తెలిపారు. నకిలీ మెడిసిన్ పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు.

# మందుల్లేవు.. బయట తీసుకోండి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత వేదిస్తోంది. నాడిపట్టిన వైద్యుడు నాలుగైదు రకాల మందులు వాడాలని రాసిస్తే అందులో రెండు బయటే కొనుక్కోవాల్సి వస్తుంది. మందులు లేక సగం మాత్రలు బయటనే తీసుకోమని చెబతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్‌తో పాటు పలు బస్తీదావాఖానాలు, పిహెచ్‌ఎసి, యూపిహెచ్‌సిలలో మందుల కొరత ఉన్నట్లు రోగులు వాపోతున్నారు.

వైద్యులు జబ్బు ఆధారంగా నాలుగైదు రోజుల కోర్సుకు చొప్పన మందులు రాస్తే.. రెండు రోజులకు అవి కూడా సగం, సగం మాత్రలు మాత్రమే ఇస్తున్నట్లు రోగులకు వాపోతున్నారు. ఈవిషయమై కొందరకు ఆసుపత్రి సిబ్బందిని నిలదీయడంతో చాలాదవాఖానాల్లో అక్కడి అధికారులు ప్రిస్క్రిప్షన్‌పై కేవలం మందులు మాత్రమే రాయాలని.. ఎన్నిరోజులు అనేది రాయవద్దని వైద్యులకు సూచిస్తున్నట్లు తెలుస్తుంది.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడిసిన్స్ కొరత ● ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్న రోగులు

### డాక్టర్ రాసిన దాంట్లో సగానికి పైగా కోత

### బయట మెడికల్ దుకాణాల్లో తీసుకోవాలని సలహాలు

హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త: చాలా దవాఖానాల్లో దగ్గు ముందను వైద్యులు రాసినా.. ఇవ్వడం లేదని, బయటి నుంచి కొనుగులు చేసుకో వాలని సిబ్బంది సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఉస్మానియా వంటి దవాఖానాల్లోనూ వైద్యులు రాసిన మందులు లేవని ఫార్మసీ కౌంటర్లలోని సిబ్బంది తిప్పి పంపిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. ఫీవర్ ఆసుపత్రికి ఓపికి వచ్చేవారికి డెంగీ పరీక్షలు రాస్తే కిట్స్ లేవని అక్కడి సిబ్బంది తిప్పిపంపిస్తున్నట్లు పేషెంట్లు ఆరోపిస్తున్నారు.

### రోగులపై ఆర్థికభారం

తెలంగాణ చుట్టుపక్కల జిల్లాల నుండి ప్రజలు వైద్యం కోసం నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ వంటి ఆస్పత్రులకు వస్తుంటారు. కానీ ఇక్కడ నామమాత్రంగా చూసి ఏవో రెండు మందు గోళీలు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శ ఉంది. వైద్యులు తక్కువ ధరకు లభించే జనరిక్ మెడికల్ షాపులో లభించే మందులు కూడా రాయడం లేదు. తక్కువ ధరకు దొరికేవి, సాధారణ జ్వరానికి వాడేవి మాత్రమే జనరిక్ మందులను రాస్తున్నారు. తీవ్రమైన అనారోగ్యానికి సంబంధించిన ఖరీదైన మందులను మాత్రం బయటి మెడికల్ షాపులకు రాస్తున్నారు. గాంధీ ఆస్పత్రి లోపల, వెలుపల పదుల సంఖ్యలో మెడికల్ షాపులు వెలిశాయి. దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు. అలాగే ఉస్మానియా, నీలోఫర్‌ల లోనూ అదేపరిస్థితి. దీన్నిబట్టి మెడికల్ దందా ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నా ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మాత్రం మారడంలేదని విమర్శలు ప్రజల నుండి వస్తున్నాయి. డబ్బులు లేక మెరుగైనా వైద్యం చేయించుకునే స్తోమతలేకనే ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తుంటే ఇక్కడ అరకొర సేవలతో రోగులకు వైద్యం ఆర్థిక భారంగా మారుతోంది. మందులు, వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కొందరు వైద్యులు కమీషన్ల కోసం కావాలనే బయటి మెడికల్ షాపులకు, డయాగ్నస్టిక్ కేంద్రాలకు రాస్తున్నట్లు సమాచారం. మరి కొంతమంది వైద్యులు తమ సొంత క్లినిక్‌లకు రోగులను రెఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సొంత క్లినిక్‌లకు వస్తే వైద్యం బాగా అందుతోందని...త్వరగా తగ్గుతుందని చెప్పి రోగులను రప్పించుకుంటున్నారు. కాస్త డబ్బున్నోళ్లు చేసేది లేక ప్రైవేటు బాట పడుతున్నారు. టెస్టులు, మందులు బయటికి రాస్తుండటంతో తమపై ఆర్థికభారం పడుతోందని ప్రజలు వాపోతున్నారు.



పాతబస్తీ అరుంధతీ నగర్ రెండులో కొత్త అంగన్‌వాడి భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లు

# సూర్యపవన్‌రెడ్డికి పిసి ఇండియన్ అచీవర్స్‌అవార్డు


సమావేశంలో అవార్డును చూపుతున్న సూర్యపవన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: విద్య, వైద్య ఎంటర్‌ప్రెన్యూర్ రంగాల్లో విశేష సేవలు అందించచిన వారిని ప్రోత్సహించేందుకు పవర్ కారిడార్ నేషనల్ మేగజిన్ వారు అందించే ప్రతిష్టాత్మకమైన పవర్ కారిడార్ ఇండియన్ అచీవర్స్ అవార్డు నగరానికి చెందిన ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి అందుకున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఈఅవార్డును అందుకున్న ఆయన మంగళవారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి మీడియాతో మాట్లాడారు. చిన్నపిల్లల్లో వచ్చే టైప్ 1డయాబెటిస్‌పై తాను 20ఏళ్లుగా చేస్తున్న రీసెర్చ్‌ను గుర్తించి ఈఅవార్డును అందించారని దీంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. చిన్న వయస్సులోనే చాలామంది పిల్లలు డయాబెటిస్ బారిన పడుతున్నారని కొంతమంది జన్యుపరంగా డయాబెటిస్ వస్తుంటే మరికొంతమంది ఆహార అలవాట్ల డయాబెటిస్ బారిన పడుతున్నారన్నారు.

# తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నూతన కమిటీ ఎన్నిక

**రాష్ట్ర అధ్యక్షులుగా మొండికత్తి లింగన్న మాదిగ**


కరపత్రం ఆవిష్కరిస్తున్న మల్లేష్ మాదిగ, లింగన్న మాదిగ తదితరులు

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఇప్పటివరకు ఉన్న పాతకమిటీని రద్దు చేస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు మర్మముల మల్లేష్ మాదిగ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మొండికత్తి లింగన్న మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా మొట్టుపల్లి కొమురయ్య మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లద్ద నర్సింహులు మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుశనపల్లి రవి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంకటి శ్యామెల్ , రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బొట్ల రమేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఆకి ధర్మతేజలను ఎన్నుకున్నారు. ఈసంర్భంగా మల్లేష్‌మాదిగ, లింగన్న మాదిగలు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీని మరింత బలోపేతం చేయడంతో రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తూ మాదిగ, మాదిగ ఉపకులాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా 10డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని రాష్ట్ర కమిటీ చేతులో మీదుగా విడుదల చేశారు.

# సుప్రీం కోర్టు తీర్పు అభినందనీయం

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ముషీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త: లంచం విచారణలో పార్లమెంటు, విధాన, శాసన సభల సభ్యులకు ఎలాంటి మినహాయింపు లేదని, వారేమీ చట్టాలకు అతీతులు కాదని మన దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ లంచాలు తీసుకుని సభల్లో ప్రసంగించటం, ప్రశ్నలు వేయటం, ఓటు వేయటం సహా అవినీతికి పాల్పడే ఎంపీలు, ఎమ్మెల్యేలను అవినీతి నిరోధకచట్టం క్రింద విచారించవలసిందేనని, ఇలాంటి వారు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ, నాయకులపై విశ్వసనీయత కోల్పోయిన పౌరసమాజానికి, ప్రజలకు వ్యవస్థపై విశ్వాసం పెంచే విధంగా ఈ తీర్పు ఉందని అన్నారు.

# గ్రేటర్‌లో టిఆర్ఎస్ గెలుపులో యువత పాత్ర కీలకం

**శాసనసభ్యులు కె.పి.వివేకానంద్**


టిఆర్ఎస్ యువజన నాయకులు కూన గిరిధర్‌ను సత్కరిస్తున్న కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, ఇందుకూరి సూర్యప్రభ, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్, మార్చి 5 ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ పరిధితోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాలలో టిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపులో యువత పాత్రకీలకమైందని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. మంగళవారం టిఆర్ఎస్ యువజన విబాగం నాయకులు కూన గిరిధర్ నాయకత్వంతో జరిగిన కార్యక్రమానికి స్థానిక మాజీ కార్పొరేటర్ కూన గౌరీష్‌తో కలిసి పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలో టిఆర్ఎస్ విజయానికి యువత చేసినకృషి అభినందనీయమన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూన గిరిధర్ వంటి నాయకులు రాత్రింబగళ్లు శ్రమించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఇందుకూరి సూర్యప్రభ, కుత్బుల్లాపూర్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి సహాయం అందిస్తా : వద్దేపల్లి


ఆలయ పున: నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 5, ప్రభాతవార్త: ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్‌రెడ్డి నగర్‌లో గల శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు తన తండ్రి దివంగత నేత వద్దేపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం బోరు వేయించి మోటార్ బిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బోరును ప్రారంభించారు. అనంతరం ఆలయ పున: నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి వద్దేపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం దేవాలయాలకు సేవ చేయడం తన అదృష్టమని, శ్రీ ఆంజనేయ దేవాలయానికి కూడా తనవంతు సహాయాన్ని అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబ్దుల్ బాకీ, సెక్రటరీ దత్తు, సాగర్, రాంరెడ్డి, విష్ణు, శ్రీనివాస్, రాంచందర్, లింగం, గోపాలకృష్ణ, విశ్వనాథం, అబ్దుల్‌కలామ్, రమేష్ పాల్గొన్నారు.


బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డులలో పర్యటించి ఆస్తిపన్ను చెల్లించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర

# నాపై కావాలనే దుష్ప్రచారం

**కౌన్సిలర్ సత్యనారాయణ**


తన స్థలం వద్ద దృవపత్రాలను చూపుతున్న కౌన్సిలర్ సత్యనారాయణ

దుండిగల్, మార్చి 5 ప్రభాతవార్త: కొందరూ వ్యక్తులు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని కౌన్సిలర్ సత్యనారాయణ పేర్కొన్నారు. తనపై వచ్చిన కబ్జా ఆరోపణపై ఆయన మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బహాదూర్‌పల్లి సర్వేనంబర్ 63లోని 10.09 ఎకరాల్లో చేసిన లేఅవుట్‌లో గల 169గజాల స్థలం, ప్లాట్ నంబర్ 19ను సుధారాణి వద్ద, సర్వేనంబర్ 62/1/ఎ,లో 2400గజాల స్థలాన్ని రత్నమాల వద్ద నుండి కొనుగోలు చేశానన్నారు. తనకు విక్రయించిన వారే స్థలం చుట్టూ ప్రహారీ నిర్మించి తనకు అప్పగించారని తెలిపారు. కొద్ది రోజుల క్రితం ప్రవీణ్‌పటేల్, చేతన్‌పటేల్ అనే వ్యక్తులు స్థలం మాది అంటూ రావడంతో విషయం పిఎస్‌కు చేరడంతో వారు సర్వేకు పంపడం జరిగింది. మండల సర్వేయర్ వచ్చి హద్దులు చూపడంతో పోలీసులు ఎవరి హద్దుల్లో వారు ఉండాలని తగాదాలకు పోవద్దని పేర్కొన్నారు. అయితే రెండు రోజుల క్రితం ప్రవీణ్‌పటేల్, చేతన్‌పటేల్‌లు రాత్రి సమయంలో నాస్థలం వద్దకు వచ్చి ప్రహారీని కూల్చివేసి రహాదారికి అడ్డంగా కంటైనర్ ఏర్పాటు చేసి కొంతమందిని అక్కడ కాపాలదారులుగా ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న నేను నాస్థలం వద్దకు వెళ్ళడంతో నాపై దుర్భషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడడంతో నేను పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాను. నేను కొనుగోలు చేసిన దృవపత్రాలను సమర్పించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరాను. నేను న్యాయబద్దంగా కొనుగోలు చేశాను ఎటువంటి కబ్జాలకు పాల్పడలేదు. నాకు విక్రయించిన వారు సైతం ఉన్నారు. కొందరు పనిగట్టుకొని నాపై దుష్ప్రచారం చేస్తున్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు మూడు సీట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్యమాదిగ డిమాండ్

సైఫాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ సీట్లు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ డిమాండ్ చేశారు. మాదిగలకు సీట్లు కేటాయించకుండా మాలలకు కేటాయిస్తే చిత్తుగా ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. మాదిగ యువసేన కో-ఆర్డినేటర్ మంచాల యాదగిరిమాదిగ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో మాదిగ యువతకు తీరని అన్యాయం జరిగిందని వారి అభివృద్ధికి ఏలాంటి తోడ్పాటు అందించలేదన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, ఉద్యోగ రంగాలలో మాదిగ యువతకు ప్రాధాన్యత కల్పించాలని, ఇంటర్, డిగ్రీ, పిజి చదవిన యువతీయువలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# మోండా మార్కెట్‌కు వెంకటేశ్ యాదవ్ సేవలు మరువలేనవి : ఎమ్మెల్యే తలసాని


మోండా మార్కెట్‌లో తలసాని వెంకటేశ్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, మార్చి 5 ప్రభాతవార్త: మోండా మార్కెట్ లో పనిచేస్తున్న కార్మికులు, వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం వెంకటేశ్ యాదవ్ ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మోండా మార్కెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు,దివంగత తలసాని వెంకటేశ్ యాదవ్ 16వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మోండా మారె ్కట్‌లోని ఆయన విగ్రహానికి తలసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తలసాని సోదరులు నర్సింగ్ యాదవ్, శంకర్ యాదవ్, మహేశ్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, బేగంపేట కార్పోరేటర్ మహేశ్వరీ, బిఆర్ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, రాములు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నేడు కుత్బుల్లాపూర్ సర్కిల్ వద్ద నిరసన

కుత్బుల్లాపూర్, మార్చి 5 ప్రభాతవార్త : ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్రజలనుండి ముక్కుపిండి వసూళ్లకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనకార్యక్రమాలను టిఆర్ఎస్ చేపట్టింది. దీనిలో భాగగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వద్ద స్థానిక శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ నాయకత్వంలో ఎలాంటి చార్జిలు లేకుండా ప్లాట్ల క్రమబద్దీకరణ చేయాలని కోరుతూ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, నాయకులు అధికసంఖ్యలో హాజరై నిసరన కార్యక్రమానికి మద్దతు పలకాలని విజ్ఞప్తిచేశారు.

# నెమలికంటి ముగింపులేని కథలు

**ఆచార్య కొలకలూరి ఇనాక్**

రవీంద్రభారతి, మార్చి 5 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీకళానికేతన్ హైదరాబాద్ సమర్పణలో నెమలికంటి తారక రామారావు రచించిన ముగింపులేని కథలు పుస్తకావిష్కరణ-అంకితోత్సవం కార్యక్రమాలు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరుపుతున్నట్లు సంస్థ అధ్యక్షుడు సాధు శ్యాంప్రసాద్ మీడియాకు తెలిపారు. గురువారం 7 రాత్రి 6.30గంటలకు డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా హాజరై సభాప్రారంభకుడు డా. ఓ.శ్రీనివాసరెడ్డి, ఆత్మీయ అతిథులు ఆచార్య రామవరపు గణేశ్వరరావు, కె.హరీష్‌రెడ్డి, జె.సాంబశివరావు, పుస్తక రచయిత నెమలికంటి తారక రామారావు తదితరులతో కలిసి ముగింపులేని కథలు పుస్తకాన్ని ఆవిష్కరించి లయన్ సాధు శ్యాంప్రసాద్ దంపతులకు అంకితమిస్తారని, సీనియర్ సంపాదకుడు ఎ.ఎస్.జగన్నాథశర్మ పుస్తక సమీక్ష కావిస్తారని శ్యాంప్రసాద్ వివరించారు.

# కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే 'విశ్వకర్మ యోజన పథకం'

**కార్పొరేటర్ పావనీ వినయకుమార్**


పిఎం విశ్వకర్మ లబ్దిదారుల వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, మార్చి 5ప్రభాతవార్త: సంప్రదాయ పనిముట్లను, చేతులను ఉపయోగించి పనిచేసే కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే 'విశ్వకర్మ యోజన పథకం' ప్రధాన లక్ష్యమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకు మార్ అన్నారు. మంగళవారం డివిజన్ జరిధిలోని కార్పొరేటర్ వార్డు కార్యాలయంలో 'పిఎం విశ్వకర్మ పథకం లబ్దిదారులకు వెరిఫికేషన్' కార్యక్రమం జరిగింది. వెరిఫికేషన్ సందర్భంగా వార్డు కార్యాలయంలో జరుగుతున్న తీరును పరిశీలించి లబ్దిదారులకు తగిన సూచనలను, సలహాలను అందించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, బిజెపి నేతలు నర్సింహా , రఘుయాదవ్, వివ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బిసిలకు అన్ని రాజకీయ పార్టీలు 9 సీట్లు కేటాయించాలి

**ఇచ్చిన పార్టీలకే బిసిల మద్దతు లేకపోతే చిత్తుగా ఓడిస్తాం**

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సైఫాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు 9 స్థానాల ను కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల అధ్యక్షులకు ఆయన విజ్ఞప్తి చేశారు. బిసిలకు 9 స్థానాలు కేటాయించిన రాజకీయ పార్టీకే బిసిల మద్దతు ఉంటుందని, ఇవ్వని పార్టీలను చిత్తుగా ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. జాతీయ బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్‌లో జరిగిన యువజనుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు అన్ని రాష్ట్రాలలో, అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన సగం సీట్లు కేటాయించాలని కోరారు. ఈ మేరకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో బిసి సంఘాలకు నూతన కమిటీలు వేయడం జరిగిందన్నారు. రాజ్యాధికారం కోసం అధికార పార్టీ-ప్రతిపక్ష పార్టీ మధ్య హోరా హోరీ పోరు జరుగుతున్నందున గెలుపు గుర్రాలు, ఆర్థిక బలం అంటూ బిసిలకు సీట్లు ఇవ్వకుండా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, భరత్‌కుమార్, నీల వెంకటేష్, పి.సుధాకర్, నర్సింహ్మాగౌడ్, కృష్ణయాదవ్, వేముల వెంకటేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిన కంటోన్మెంట్ బోర్డు

**డొమెస్టిక్ బోర్ నీళ్లకు బిల్లులు మాఫీ**



కంటోన్మెంట్ ఎమ్మెల్యే దివంగత ఎమ్మెల్యే లాస్యకు సంతాపం తెలిపిన కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి

కంటోన్మెంట్,మార్చి 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని డొమాస్టిక్ వినియోగదారులకు బోరు నీటికి మీటర్లు, బిల్లులు మినహాయించినట్లు బోర్డు ఆమోదం తెలిపింది. కమర్షియల్ బోరు మీటర్లకు పన్నులు విధించాలని ఆమోదం తెలిపింది. మంగళవారం కంటోన్మెంట్ పాలక మండలి బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ కె.సోమశంకర్, సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, డిప్యూటీ సిఈఓ విజయ్ కుమార్ బాలన్ నాయర్‌ల సమక్షంలో వివిధ అంశాలపై చర్చించి పలు ఎజెండాలను తీర్మాణించారు. నష్టపోయిన ఆదాయం కేంద్రం నుంచి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బోర్డు నిర్ణయించింది. ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి, కొంపల్లి వరకు, సికింద్రాబాద్ జింఖానా నుంచి కార్ఖాన, లాల్‌బజార్, హకీంపేట్ వరకు రెండు ఎస్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించింది. మట్‌పోర్ట్‌లో నిర్మించిన మహిళా హాస్టల్‌ను, మహేంద్రహిల్స్‌లో అన్ని హంగులతో నిర్మించిన పార్కు ఉద్యానవనం ఈ నెల 7న ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది. కంటోన్మెంట్ బోర్డు భవన విస్తరణానికి రూ.1 కోటీ 46 లక్షల నిధులు మంజూరు చేయుటకు ఆమోదం తెలిపింది.

**ఎమ్మెల్యే లాస్యకు సంతాపం తెలిపిన బోర్డు..** కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధకరమని, అతి చిన్న వయసులో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి 3 నెలలోపే మృతి చెందడం బాధకరమని బోర్డు విచారం వ్యక్తం చేసి 2 నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపరిండెంట్ ఎం.దేవేందర్, జలమండలి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## మహిళా భాగస్వామ్యంతోనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

కొంపల్లి, మార్చి 5, ప్రభాతవార్త : కొంపల్లి మున్సిపాలిటీ సాయికృప అపార్ట్‌మెంట్‌లో మంగళవారం నాలుగో డివిజన్ కౌన్సిలర్ మాదంశెట్టి సువర్ణ సాగర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కెపి వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు లేనిదే మానవ మనుగడ లేదు, ఉనికిలేదు, నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. మహిళ భాగస్వామ్యం ఉన్న దేశాలే వేగంగా అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు శ్రీవిద్య, సరిత, కో ఆప్షన్ సభ్యులు మంగమ్మ, బిఆర్ఎస్ మహిళా నాయకురాలు సంగీతారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సన్న శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్లు సన్న రవి, కొంపల్లి బిఆర్ఎస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణసాగర్ పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

**ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**


జలమండలి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: వేసవి రోజుల్లో కూడా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో మంచినీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తెలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నీటి సరఫరా తీరుతెన్నులు, వేసవి కార్యాచరణపై మంగళవారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ ఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పరిధిలో రోజుకు 25,50 ఎంజీడీల మేరకు మంచినటీ సరఫరా జరిగేలా తాము ఏర్పాట్లు జరిపామని తెలిపారు. ఆదే విధంగా అడ్డగుట్ట, మెట్టుగూడ, తార్నాక. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలో కలిసి సుమారుగా 195 పవర్‌బోర్‌లను ఏర్పాటు చేశామని, అవి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యమంలో మేనేజర్లు అన్విత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబీర్ చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం

**డిప్యూటీ మేయర్**


మార్నింగ్ వాకర్స్‌తో డిప్యూటి మేయర్, కార్పోరేటర్

నిజాంపేట్, మార్చి 5, ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ అంబీర్ లేక్ పరిసరాలు, వాకింగ్ ట్రాక్ సమస్యలను వాకర్స్‌తో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, 8వ డివిజన్ కార్పోరేటర్ సురేష్‌రెడ్డిలు కలిసి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ఏర్పడ సమస్యలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కెపి వివేకానంద, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సంబంధిత అధికారులతో చర్చించి తొందర్లోనే అత్యుత్తమ సౌకర్యాలతో, ప్రజలకు ఆహ్లాదం పంచేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వాకింగ్ చేసుకోవడానికి వచ్చే ప్రజలకు, వృద్ధులకు, పిల్లలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాకింగ్ ట్రాక్‌ను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్, సీనియర్ సిటీజన్ ప్రజలు పాల్గొన్నారు.


మణికొండలో నీటి సమస్యను తీర్చాలని కోరుతూ జల మండలి ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శైలజ, దివ్యజ్యోతి యువజన సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, అధ్యక్షులు నరేష్ యాదవ్, నరేందర్(టింకు), శ్రీకాంత్, సుధాకర్, విఘ్నేశ్వర్, వినోద్, మధు, మహేష్

## పారిశ్రామిక ప్రంతంలో మంజూరైన 150 సీసీ కెమెరాలు



జీడిమెట్ల, మార్చి 5, ప్రభాతవార్త : జీడిమెట్ల సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పారిశ్రామిక ప్రాంతంలో 150 సీసీ కెమెరాలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బాలానగర్ ఎసిపి శ్రీనివాసులు (ట్రాఫిక్ విభాగం), జీడిమెట్ల సిఐ శ్రీనివాస్ రావు (లా అండ్ ఆర్డర్), జీడిమెట్ల సిఐ శ్రీనివాస్ (ట్రాఫిక్), ఐల కమీషనర్ నజీర్ అహ్మద్, వైస్‌చైర్మన్ ఏఎల్ఎన్ రెడ్డి, సెక్రటరీ సాయి కిషోర్, ట్రెజరర్ కృష్ణ, భాస్కరరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బి.బి.పాటిల్‌కు సన్మానం

అఫ్జల్‌గంజ్,మార్చి 5ప్రభాతవార్త: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థిగా బి.బి.పాటిల్‌ను గోషామహల్ నియోజకవర్గం బిజెపి నాయకులు,తెలంగాణ భజరంగ్‌సేనా కార్యవర్గం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి బి బి పాటిల్‌ను తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త,ప్రధాన కార్యదర్శి శూర్యశుక్లా శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో భజరంగ్‌సేనా ప్రతినిధులు ఎం.మనోజ్,వెంకటేష్‌కులకర్ణి,ఆనంద్‌మిశ్రా,రామేశ్వర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ బూత్‌లో వ్యక్తి మృతదేహం

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: బంజారా హిల్స్ పరిదిలోని ఓట్రాఫిక్ వ్యక్తి మృతదేహం లబించడం స్థానికంగా కలకలం రేపింది. ట్రాఫిక్ బూత్‌లో రక్తపు మడుగులో లభించడం స్థానికంగా కలకలం రేపింది. ట్రాఫిక్‌బూత్‌లో రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు.

## రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ నిరసన

నిజాంపేట్, మార్చి 5, ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్దీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 6వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో నేడు ఉదయం 10:30 గంటలకు జిహెచ్ఎంసి పరిధిలోని కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలం వద్ద బిఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్‌ల అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేయర్ క్యాంప్ కార్యాలయం నుండి తెలియజేశారు.



నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి కాజల్ అగర్వాల్

## మహిళలు నేటికి వివక్షను ఎదుర్కోవడం విచారకరం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మహిళకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పోరేటర్ పన్నాల

నాచారం, మార్చి 5 ప్రభాతవార్త: కొన్ని ప్రాంతాల్లో నేటికి మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మహిళాదినోత్సవ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ చరిత్రలో గొప్ప గొప్ప మహిళలు సమానత్వం కోసం పోరాడారని తెలిపారు. నేడు ఎంతో మంది మహిళలు ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్నారని కొనియాడారు. హక్కుల కోసం పోరాడిన మహిళలను స్మరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహిళాసాధికారత కోసం పనిచేసిన మహిళలకు జ్ఞాపికలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ బోర్డు కార్పోరేటర్ ప్రభుదాస్, ప్రసిడెంట్ మధన్, ఆర్‌పీ సుజాత, జగన్, వాసు, లంబు శ్రీను, శ్రీనివాస్ రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## నేడు మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో ధర్నా

సరూర్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలపై ఆర్థిక భారం మోపకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని ఉచితంగా అమలు చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేయాలని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ క్రాస్ రోడ్స్ వద్ద స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుండి బిఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ శ్రేణులు హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

## అంబికానగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్‌కు వినతి



కౌన్సిలర్‌ను కలిసిన అంబికానగర్ కాలనీవాసులు

హయత్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 7వ వార్డు పరిధి అంబికానగర్‌కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డికి విన్నవించారు. కాలనీలో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని తెలిపారు. కాలనీ ప్రధాన రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలను వదిలే కంపెనీల నుంచి దుర్వాసన వస్తోందని వివరించారు. వెంటనే రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కల్పించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల దుర్వాసన సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్‌ను కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రాములు, ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి అంబేద్కర్, వెంకటేష్, మురళీ, సాగర్, మల్లయ్య పాల్గొన్నారు.

## మేరు కులస్తులకు ఎంపి టిక్కెట్లు కేటాయించాలి : పోల్కం శ్రీనివాస్



ర్యాలీగా తరలుతున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

మలక్‌పేట, మార్చి 5 ప్రభాతవార్త : మేరు కులస్తులకు రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపి టికెట్లను కేటాయించాలని రాష్ట్రకాంగ్రెస్ ఒబిసి సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ర్యాలీగా గాంధీభవన్‌కు వెళ్లి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో చర్చించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మేరు కులస్తులకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. టికెట్టు కేటాయిస్తే విజయం సాధిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి న్యాయం జరిగేలా చూడాలని మల్లు రవిని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, గంగాపురం దశరథ్, గోపాల్‌రెడ్డి, పోల్కం విజయ్‌రాజ్, కొండూరు చంద్రశేఖర్, కీర్తి జయంత్, మునగాల రమేష్, వెన్ను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి : కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్ తదితరులు

మలక్‌పేట, మార్చి 5 ప్రభాతవార్త: ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేటల ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బిజెపి కార్యదర్శి చీపురు రాజారావుగౌడ్, ఎ బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు చౌకి విజయ్‌కుమార్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ నేరెడ్‌మెట్ మొదటి రైలుకు స్వాగతం పలికిన కార్పొరేటర్ శ్రావణ్..



ఎంఎంటిఎస్ రైలుకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ శ్రావణ్..

నేరెడ్‌మెట్, మార్చి 5 ప్రభాతవార్త: ఎంఎంటీఎస్ ఫేస్-2లో భాగంగా ఘట్‌కేసర్‌నుండి ప్రారంభమైన ఎంఎంటీఎస్ రైలుకు నేరెడ్‌మెట్ స్టేషన్‌లో కార్పొరేటర్ శ్రావణ్ ఘన స్వాగతం పలికారు. నేరెడ్‌మెట్ స్టేషన్ వద్దకు రాగానే పూలతో ఎంఎంటీఎస్ రైలును స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాయంలో దేశాభివృద్ధి పూర్తిగా మారిపోయిందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వ వాటాను కేంద్ర ప్రభుత్వం చెల్లించి రైల్వే పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనివల్ల ఎంతో మంది ప్రయాణీకులకు ఎంతో సమయం ఆదా అవుతుందన్నారు. దేశాభివృద్ధి కోసం ఎంతగానో దోహదపడుతున్న మోదీ మరోసారి అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బాలలింగం, డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, నందు, మురళి, సంతోష్, రవి, ప్రభు, కృష్ణమూర్తి, అంజన్న, సుకేష్, శ్రీకాంత్, సుశీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్ అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం చెక్కును చైర్మన్ మర్రి నర్సింహారెడ్డికి అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

సరూర్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామంలో పునర్నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన మర్రి రవీందర్‌రెడ్డి రూ.లక్ష పదహారు వేలను విరాళంగా ఇచ్చారు. బాలాపూర్ చౌరస్తాలో టివిఎస్ షోరూం అధినేత అయిన రవీందర్‌రెడ్డి తన స్వగ్రామంలోని టెంపుల్ పునర్నిర్మాణ పనుల కోసం రూ. 1,16,000కు సంబంధించి చెక్కును ఆలయ కమిటీ ఛైర్మన్ మర్రి చిన్న నర్సింహారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఆయనను శాలువాతో సన్మానించి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చమన్ బిక్షపతిగౌడ్, భాస్కర్‌రెడ్డి, సామయ్య యాదవ్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఆర్‌సిఐ స్వీపర్ దుర్మరణం

సరూర్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో ఆర్‌సిఐ స్వీపర్ దుర్మరణం పాలైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పహాడీషరీఫ్ బస్తీలో నివాసం ఉంటున్న బిహారీ పార్వతి (54) అనే మహిళ కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఆర్‌సిఐలో గత 15 సంవత్సరాలుగా స్వీపర్‌గా పని చేస్తున్నది. అయితే మంగళవారం ఉదయం విధుల కోసం ఆర్‌సిఐకి నడుచుకుంటూ వెళ్తుండగా పహాడీషరీఫ్ బైపాస్ లోని ఎయిర్‌పోర్టు హోటల్ వద్ద వేగంగా వచ్చిన కారు (నెంబర్ టిఎస్ 11 యుడి 2228) ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన పార్వతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గృహజ్యోతి సంక్షేమ పథకం నిరుపేదలకు వరం : ఎం.పరమేశ్వర్‌రెడ్డి

నేరెడ్‌మెట్, మార్చి 5 ప్రభాతవార్త : సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు వరంగా మారుతున్నాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్‌లో గృహజ్యోతి పథకం అమలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే రెండు పథకాలు అమలవుతుండగా కొత్తగా మరో రెండు పథకాలు తీసుకుని రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు సి.రఘుపతిరెడ్డి, బజారు జగన్‌గౌడ్, ఆగంరెడ్డి, మహేష్, రాజేష్, బూర్గుల రమేష్,బొట్టు రాజేష్, మంచాల రఘు, పల్లె రమేష్‌గౌడ్, సుశీల, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## వన్ టైం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట, మార్చి 5 ప్రభాతవార్త : ఆస్తి పన్ను యొక్క పేరుకుపోయిన బకాయిలు 2022-23 సంవత్సరానికి సంబంధించి అపరాధ రుసుములో 90 శాతం మాఫీతో కేవలం 10 శాతం అపరాధ రుసుము మాత్రమే చెల్లించాలని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఆస్తి పన్ను చెల్లించడానికి వారిని ప్రోత్సహించడానికి వన్ టైమ్ స్కీం పథకం క్రింద బకాయిలు ఉన్నవారికి 90 శాతం అపరాధ రుసుము మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి గ్రేటర్ అభివృద్ధికి తోడ్పడాలని డిప్యూటీ కమిషనర్ జయంత్ పేర్కొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం : కౌన్సిలర్ అనురాధ



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ బొర్ర అనురాధసురేష్

హయత్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ బొర్ర అనురాధసురేష్ అన్నారు. వార్డుపరిధిలో 5 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... వార్డు పరిధిలో మిగిలి ఉన్న సీసీరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## విద్య, వైద్యం పేరుతో వసూళ్లు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతి



మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న బొజ్జయాదగిరి

నాచారం, మార్చి 5 ప్రభాతవార్త: విద్య, వైద్యంపేరుతో పేదల నుంచి లక్షలు వసూలు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి సీతక్కకు దళిత జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ యాదగిరి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. నగరంలోని పలు చోట్ల ఉన్న ప్రైవేట్ సెక్టార్లలో విద్య, వైద్యరంగాల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తూ ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు.అనంతరం మంత్రి సీతక్కను బొజ్జయాదగిరి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంతప్, దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్, కార్యదర్శి భాపండ్ల పల్లి గంగాధర్, బీసీ రాష్ట్ర నాయకులు ఎదునూరి సంతప్, సయుక్త కార్యదర్శి చేర్యాల బాలయ్య, మైనార్టీ నాయకులు సయ్యద్ మాజీద్, భార్గవ్, కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ శంఖుస్థాపన మహోత్సవం సందర్భంగా మన్యురుద్ర నవచండీ యాగం



పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న తదితరులు

వనస్థలిపురం, మార్చి 5 ప్రభాతవార్త: బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ సౌత్‌లో మంగళవారం నూతన దేవాలయ నిర్మాణ శంఖుస్థాపన మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మన్యురుద్ర సహిత నవచండి యాగంలో మాజీ కార్పొరెటర్ ముద్దగౌని లక్ష్మిప్రసన్న రామ్మోహన్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఆలయ చైర్మన్ బొగ్గ కొండల్‌రెడ్డి, ఆలయం కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైస్ చైర్ పర్సన్ హరితపై ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి హాజరుగాని కౌన్సిలర్లు

తుర్కయాంజాల్, మార్చి 5 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితపై ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం కౌన్సిలర్లు అందరూ హాజరు కాకపోవడంతో మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ వార్డు కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారంగా అనంతరెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మార్చి 5 ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశాన్ని కౌన్సిలర్లు ఎవరు హాజరు కాకపోవడంతో ఎస్ ఫర్ మున్సిపల్ యాక్టింగ్ జీవో ఎం ఎస్ నెంబర్ 835 ప్రకారం సుమారు 11 గంటల నుండి 11:30 వరకు నిమిషాల వరకు వేచి చూచి సబ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో 12 గంటల వరకు కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుసూ నోటీసులు జారీ చేసి తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 12 గంటల 30 నిమిషాల వరకు అధికారులు వేచి చూసిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాస తీర్మానాన్ని అయిపోయినట్లు ఇబ్రహీంపట్నం ఆర్డిఓ ప్రిసీడింగ్ అధికారి అనంత రెడ్డి ప్రకటించారు. తదుపరి చర్యలకు జిల్లా కలెక్టర్ గారికి పంపించడం జరుగుతుంది. దీంతో తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ గా గుండ్లపల్లి హరిత అనే మళ్లీ కొనసాగనున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వార్డు కార్యాలయం పరిసర ప్రాంతంలో పెద్ద ఎత్తున పోలీసులను బంధబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంలో మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు



మరమ్మతుల అనంతరం పైప్‌లోనుంచి వస్తున్న బోరునీరు

హయత్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త: కాలనీల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ డివిజన్‌కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి షిర్డీసాయి నగర్ (వీరన్నగుట్ట)లో నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరగా వెంటనే స్పందించిన కార్పొరేటర్ బోరుకు మరమ్మతులు చేయించారు. బస్తీ దవాఖానాతో పాటు కాలనీలోని మరో బోరుకు కూడా త్వరలోనే మరమ్మతులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువస్తామని హామీనిచ్చారు. కాలనీవాసుల సహకారంతో వీరన్నగుట్టలో సమస్యలను అన్నింటినీ పర్కిరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు డా.నరసింహ, ప్రధాన కార్యదర్శి కోటయ్య, కోశాధికారి రవి పాల్గొన్నారు.

## కేంద్ర బలగాలు, పోలీసులతో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో పాల్గొన్న డిసిపి స్వామి తదితరులు

సైదాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు పురస్కరించుకుని పాతబస్తీ సౌత్ ఈస్ట్ జోన్‌లోని సైదాబాద్, మాదన్న పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో కేంద్ర బలగాలు. పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు., అదనపు డీసీపీ స్వామి.సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్ల పర్యవేక్షణలో ఈ కవాతు కొనసాగింది. సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ మార్చ్‌లో సైదాబాద్ మదన్నపేట ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ మందిరం మీద నుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మాణం వద్దు

### పార్టీలకతీతంగా సైదాబాద్‌లో నిరహారదీక్ష



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సురేందర్‌రెడ్డి, మాధవిలత

సైదాబాద్, మార్చి 5 ప్రభాతవార్త: సైదాబాద్ మెయిన్ రోడ్డుపై ఉన్న పురాతన హనుమాన్ మందిరంమీదనుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పార్టీలకతీతంగా హనుమాన్ మందిరం వద్ద మంగళవారం నిరసన దీక్షను నిర్వహించారు. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందేనంటూ మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైద్రాబాద్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొంపెల్ల మాధవిలత, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా హనుమాన్ మందిరం మీద నుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడితే చూస్తూ ఊరుకోబోమని, ఎట్టి పరిస్థితిలో అడ్డుకుని తీరుతామని వారు స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందేనంటూ నిరసన దీక్షలో పాల్గొన్న వారితో కలిసి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చచెప్పడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్ల కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కుర్మగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు, హైద్రాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొరుదు భూమేశ్వర్, నాయకులు చవ్వ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా కందాల బలదేవరెడ్డి



బలదేవరెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

తుర్కయాంజాల్, మార్చి 5 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామానికి చెందిన కందాల బలదేవరెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా బల్దేవరెడ్డి మాట్లాడుతూ ఈ పదవిని నాకు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉద్యమకారుల సంక్షేమంకోసం నిరంతరం పని చేస్తానని అమరుల ఆశయ సాధన కోసం కృషి చేస్తానని మాట ఇస్తున్నాను. ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు చైర్మన్‌కు ప్రధానకార్యదర్శి రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగే విష్ణువర్ధన్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కారింగుల నరేందర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కొంతం యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వసూలుకు వన్ టైం సెటిల్మెంట్ పాత జరిమానాలపై 90% రాయితీ

ఎల్.బి.నగర్, మార్చి 5 ప్రభాతవార్త: ఆస్తి పన్ను వసూలు చేసేందుకు జిహెచ్ఎంసి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సరూర్‌నగర్, హయత్‌నగర్, ఎల్బినగర్ సర్కిల్ పరిధిలో వన్ టైం సెటిల్మెంట్ పథకం ద్వారా పాత బకాయాలు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. పన్ను వసూలు చేయడంలో భాగంగా ఇప్పటికే మొండి బకాయిదారులకు నోటీసులను జారీ చేశారు. వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పాత బకాయిలపై విధించిన జరిమానాల్లో 90% రాయితీ ఇస్తున్నట్లు జిహెచ్ఎంసి అధికారులు ప్రకటించారు. ఈ నెలలో ప్రతి ఆదివారం ఆస్తిపన్నుపై పరిష్కార వేదికలో ఏర్పాటు చేస్తామని దీంతో బకాయిదారులకు లబ్ధి చేకూరుతుందని అధికారులు తెలిపారు. 2023...24 హార్దిక సంవత్సరానికి సంబంధించి 13 డివిజన్లో రూ.212 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయడం లక్ష్యం కాగా అధికారులు ఇప్పటికే రూ.120 కోట్లు వసూలు చేశారు. ఈ నెలాఖరులోగా రూ.12 కోట్లు వసూలు చేస్తే అధికారుల లక్ష్యం కూడా పూర్తవుతుంది. మార్చి నెలాఖరులోగా పూర్తి మొత్తంలో బకాయాలను వసూలు చేసే విధంగా అధికారులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆస్తి పన్ను పై ఫిర్యాదులు సందేహాలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించుకోవాలని ఉప కమిషనర్లు సుజాత తిప్పర్తి యాదయ్య జకియా సుల్తానాలు తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు : జడ్‌సి

మలక్‌పేట, మార్చి 5 ప్రభాతవార్త : ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌యంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న తెలిపారు. చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్కిల్‌కు చెందిన ఆస్తి పన్ను సమస్యలపై 3 ఫిర్యాదులు, మలక్‌పేట్ సర్కిల్లోని అక్రమ నిర్మాణం, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లోని నాలా విస్తరణ, విద్యుత్ స్తంభం సమస్యలకు సంబంధించిన మొత్తం 6 ఫిర్యాదులందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, డిప్యూటీ డైరెక్టర్ (యూ బి డి) అమీనా బీ, టౌన్ ప్లానింగ్ జోన్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, ఎ. యం సీ రాజారావు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఈఈ హరి కిషోర్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువును సందర్శించిన అధికారులు

హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త : రామంతాపూర్ పెద్ద చెరువును సోమవారం జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో పలువురు అధికారులు సందర్శించారు. జోనల్ కమిషనర్‌తో కలిసి ఉప్పల్ డిసి జి.అంజనేయులు, ఇంజనీర్ ఎల్.నాగేందర్, టౌన్‌ప్లానింగ్ ఎసిపి ఎం.వి.వెంకటరమణ, డిఇ చందన, టిపిఎస్ సురేష్ తదితరులు సందర్శించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పెద్ద చెరువులో ఆక్రమణలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు పరిరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని, చెరువును సర్వంగా సుందరంగా అలంకరించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. చెరువు చుట్టూ ప్రత్యేక రక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.